


బస్టాండ్ ప్రాంగణంలో..

ప్రస్తుతం రైతుబజారు లేకపోవడంతో పాతబస్టాండ్ ప్రాంగణంలో కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ఒక వైపు మైదానం, మరో వైపు ఉద్దానం, ఇంకోవైపు తీర ప్రాంతం ఉండడంతో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్యకారులు చేపలను తెచ్చి ఇక్కడే విక్రయిస్తున్నారు. గిరిజనులు సైతం అటవీ ఉత్పత్తులు ఇక్కడే అమ్ముతున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో కూరగాయల దుకాణాల వల్ల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలు కూడా నిలిపేందుకు అగచాట్లు తప్పడంలేదు. కొందరు జంట పట్టణాల్లో రహదారులపై షాపులు ఏర్పాటు చేసి విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.

ప్రకటించారు.. మరిచారు





- పలాస-కాశీబుగ్గలో కలగానే రైతుబజారు
- అమలుకు నోచుకోని సీఎం జగన్ ప్రకటన
- రోడ్డుపైనే విక్రయాలతో తప్పని ఇబ్బందులు



కూరగాయల క్రయవిక్రయదారులతో రద్దీగా ఉన్న కాశీబుగ్గ పాతబస్టాండ్ ప్రాంగణం

- రాష్ట్ర వ్యాప్తంగా 100 రైతుబజార్లు ఏర్పాటు చేస్తాం. ఆ జాబితాలో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు కూడా చోటు కల్పించాం. రైతుబజారు ఏర్పాటు కోసం రూ.50 లక్షలు కేటాయిస్తాం. **-ఇదీ 2019 ఆగస్టు 8న శాసనసభలో సీఎం జగన్ ప్రకటన**

- అదిగో.. ఇదిగో.. అంటూ వైసీపీ పాలనకు ఐదేళ్లు గడిచిపోయాయి. కానీ ఇంతవరకూ రైతుబజారు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో జంట పట్టణ రైతులు, మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నారు. శాసనసభ వేదికగా సీఎం జగన్, మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన ప్రకటనలు.. అమలు కాలేదంటూ ఆరోపిస్తున్నారు.

- పలాస- కాశీబుగ్గలో రైతుబజారు ఏర్పాటు చేస్తాం. స్థల పరిశీలన, టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. **- అదే శాసనసభ వేదికగా మంత్రి సీదిరి అప్పలరాజు ప్రకటన**

(కాశీబుగ్గ)

పలాస- కాశీబుగ్గ జంట పట్టణాల్లో రైతుబజారు ఏర్పాటు విషయంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఆర్భాట ప్రకటనలే తప్ప హామీ మాత్రం కార్యరూపం దాల్చలేదు. పలాస- కాశీబుగ్గలో రైతుబజారు ఏర్పాటుకు రూ.50 లక్షలు కేటాయిస్తామని.. సీఎం జగన్ ప్రకటించినా ఇంతవరకూ నిధులు మంజూరు చేయలేదు. స్థల పరిశీలన, టెండర్ల ప్రక్రియ పూర్తయిందని.. త్వరలో పనులు ప్రారంభిస్తామన్న మంత్రి సీదిరి అప్పలరాజు వ్యాఖ్యలు.. ప్రకటనలకే పరిమితమయ్యాయని రైతులు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబజారు లేకపోవడంతో రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నామని వాపోతున్నారు.

టీడీపీ హయాంలో ముందడుగు

టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతుబజారు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. 2018లో టెలిఫోన్ ఎక్స్ఛేంజి సమీపంలో స్థలాన్ని అధికారులు గుర్తించారు. టెండర్లు కూడా పూర్తిచేయడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో ఈ స్థలం తమదని కొందరు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రాగా, ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 25శాతంలోపు ఉన్న పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రైతుబజారు ఏర్పాటు ముందుకు సాగలేదు. జంట పట్టణాల్లో రైతుబజారుకు అనువైన ప్రాంతాలు ఉన్నా వైసీపీ ప్రభుత్వం గుర్తించడంలో విఫలమయ్యిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కరోనా వైరస్ విజృంభించిన సమయంలో రైతుబజారు విషయంలో వైసీపీ నాయకులు హడావుడి చేశారు. కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్ వద్ద ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో రాజన్న రైతుబజారు పేరుతో భారీ హోర్డింగ్ పెట్టి హల్‌చల్ చేశారు. ఇది మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. ఆ తర్వాత పద్మనాభపురం ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఈ ప్రాంతం జంట పట్టణాలకు దూరంగా ఉంటుందని తేలడంతో ప్రతిపాదన విరమించుకున్నారు. ఆ తరువాత ఎస్టీ హస్టల్ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో రైతుబజారు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ కోర్టు కేసులు ఎదురు కావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. దీంతో జంట పట్టణాల్లో రైతుబజారు లేకుండా పోయింది.



రైతుబజారు ఏర్పాటుకు ప్రతిపాదించిన హాస్టల్ ప్రాంగణం

ట్రాఫిక్‌కు ఇబ్బందులు



పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో రైతుబజారు ఏర్పాటు చేయకపోవడం అన్యాయం. రోడ్లపైనే కూరగాయల విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక్కడ రైతుబజారు ఏర్పాటు కేవలం కూటమి తోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ ప్రజలు గ్రహించాలి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్మించి, రైతుల సమస్యను పరిష్కరించాలి.

- డాక్టర్ వి.దుర్గారావు, పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త

రైతులను ఆదుకోవాలి



రైతులు రోడ్లపై కూరగాయలను విక్రయించుకోవాల్సి వస్తోంది. దీంతో దళారులు ఎంతకు అడిగితే అంతకు పంటను విక్రయించుకుంటున్నారు. రైతుబజారు ఉంటే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. కొనుగోలు దారులకు గిట్టుబాటు అవుతుంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలు లభిస్తాయి. రైతుబజారు ఏర్పాటుచేసి ఆదుకోవాలి.

- చాపర వేణుగోపాల్, కాశీబుగ్గ సీపీఐ నాయకుడు



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి

ఈ రెండు వారాలు.. కీలకం

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి

కలెక్టరేట్, ఏప్రిల్ 27: 'సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు రానున్న రెండు వారాలూ అత్యంత కీలకం. నిబంధనల మేరకు ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి. అధికారులంతా మరింత సమన్వయంతో పనిచేయాలి' అని ఎన్నికల పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి శేఖర్ విద్యార్థి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక, ఎన్నికల పరిశీలకులతో కలిసి నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి.. పోలింగ్ శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలని తెలిపారు. ఒడిశా నుంచి అక్రమ మద్యం రవాణాను పూర్తిగా అరికట్టాలన్నారు. కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ.. ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లను వివరించారు. పోలింగ్ కోసం 569 వాహనాలను సమకూర్చినట్లు తెలిపారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ.. జిల్లాలో పటిష్ఠ బందోబస్తు అమలు చేస్తున్నామని తెలిపారు. 520 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. ఇప్పటివరకూ రూ.4.32కోట్ల విలువైన మద్యం, బంగారం, గంజాయి సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు సందీప్‌కుమార్, పర్వేజ్ ఇక్బాల్ మాట్లాడుతూ ఓటర్ల స్లిప్పులను పూర్తి వివరాలతో శతశాతం పంపిణీ చేస్తే.. పోలింగ్ శాతం పెరుగుతుందని తెలిపారు. పోలీసు పరిశీలకుడు సచింద్ర పటేల్ మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జేసీ నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, ఏఎస్పీ ప్రేమ్ కాజల్, డీఆర్వో గణపతిరావు, ఆర్వోలు రంగయ్య, నూరుల్‌కమర్, భరత్‌నాయక్, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శనదొర, అప్పారావు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, ఏప్రిల్ 27: డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో 2017, 18, 19 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు సంబంధించి మూడో సెమిస్టర్ ఫలితాలు శనివారం విడుదల చేశారు. బీఏ, బీకాం(సీఏఎస్), బీకాం జనరల్ కోర్సు, బీఎస్సీ కోర్సులకుగాను మొత్తం 1,462మంది విద్యార్థులు హాజరుకాగా, 606మంది ఉత్తీర్ణులయినట్లు ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అలాగే ఈ నెల 30నుంచి డిగ్రీ రెండు, నాల్గో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా 62 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్

ఎచ్చెర్ల/ టెక్కలి, ఏప్రిల్ 27: పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల ప్రవేశాలకు సంబంధించి శనివారం జిల్లాలో నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. శ్రీకాకుళం డివిజన్‌లోని 26 కేంద్రాల్లో 7,195 మందికిగాను 6,492 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. టెక్కలి డివిజన్‌లోని 16 కేంద్రాల్లో 4,816 మంది విద్యార్థులకు గాను 4,362 మంది హాజరయ్యారు. మొత్తంగా 90.37శాతం హాజరైనట్టు జిల్లా సమన్వయకర్తలు గురుగుబెల్లి దామోదరరావు, ఎ.గోపి తెలిపారు. టెక్కలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ పరిశీలించారు. సూపరింటెండెంట్ రోణంకి శ్రీనివాస్‌తో పాటు అబ్జర్వర్ లోకేష్, బెనర్జీ పాల్గొన్నారు.



టెక్కలిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



మళ్లీ ఐదేళ్లంట!

నత్తనడకన మూలపేట పోర్టు

వచ్చే ఐదేళ్లలో పోర్టుల నిర్మాణం పూర్తిచేస్తామని జగన్ మేనిఫెస్టోలో వెల్లడించగా.. ఉన్నవాటికే దిక్కులేదంటూ పలువురు విమర్శిస్తున్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో గతేడాది ఏప్రిల్ 19న పోర్టుకు సీఎం జగన్ శంకుస్థాపన చేయగా.. ఇప్పటికి 30 శాతం పనులు కూడా పూర్తికాలేదు. సౌత్‌బ్రేక్ వాటర్‌కు సంబంధించిన పనులు ఇంకా 600 మీటర్లు పూర్తికావాల్సి ఉంది. ఇండోపాడ్స్ నిర్మాణాలు కూడా మరో 40వేల వరకు తయారు చేయాల్సి ఉంది. బెర్త్ నిర్మాణాలతోపాటు పోర్టుకు సంబంధించి రోడ్డు, రైలు మార్గాలు పూర్తికాలేదు. రైలు మార్గానికి సంబంధించి భూసేకరణ, సుమారు 300 ఎకరాల సాల్ట్ భూములకు సంబంధించి ల్యాండ్ అక్విజేషన్ ప్రక్రియ కొలిక్కిరాలేదు.

- ప్రధాన ప్రాజెక్టుల పూర్తికి గడువు ఇదీ
- వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోపై పెదవివిరుపు
- గత హామీలకే దిక్కులేదని అసంతృప్తి
- ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు
- ఓట్ల కోసమేనంటున్న విపక్షాల నాయకులు

(టెక్కలి)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోపై జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ఎన్నికల ఇచ్చిన హామీలేవీ సక్రమంగా అమలుకాలేదు. కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ఐదేళ్లూ నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోలోనూ పాత అంశాలే ప్రస్తావించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈసారి వైసీపీ అధికారంలోకి వస్తే.. జిల్లాకు సంబంధించి పోర్టు నిర్మాణం, ఫిషింగ్ హార్బర్, ఫిష్ ల్యాండింగ్ సెంటర్, కోల్డ్‌స్టోరేజ్ గొడౌన్‌లు, అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లు వచ్చే ఐదేళ్లలో పూర్తి చేస్తామని జగన్ మేనిఫెస్టోలో వెల్లడించారు. ఇవన్నీ గతంలో ఇచ్చిన హామీలే కాగా.. ఏవీ సక్రమంగా అమలుకాలేదు. ఆలాగే ఆసరా, విద్యాదీవెన, అమ్మ ఒడి, చేయూత వంటి పథకాలకు బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పలువురు లబ్ధిదారులకు డబ్బులు అందలేదు. దీంతో తాజా మేనిఫెస్టోను కూడా ప్రజలు నమ్మేస్థితిలో లేరని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. ఓట్ల కోసమే మోసపూరిత హామీలను ప్రకటించిందని ఆరోపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు అని చెబుతూ.. బూడిద రత్నాలుగా మార్చేసిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు విమర్శించారు. ఐదేళ్లలో ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కూటమి విజయం ఖాయమని స్పష్టం చేశారు.

హామీలకు పరిమితమైన కోల్డ్‌స్టోరేజ్

జిల్లాలో 193 కిలోమీటర్ల తీరం ఉన్నా.. ఈ ఐదేళ్లలో కోల్డ్‌స్టోరేజ్ ఊసెత్తలేదు. ఈసారి అధికారంలోకి వస్తే కోల్డ్‌స్టోరేజ్ గోదాములు కడతామని మేనిఫెస్టోలో ప్రకటించడంపై జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. మత్స్యసంపద దళారీల పాలవుతుందే తప్ప.. తమకు ఉపాధి దక్కడం లేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది వలసబాట పడుతున్నారు.

అందరికీ అందని ఆసరా

జిల్లాలో సుమారు 38,804 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వీటికి వైఎస్సార్ ఆసరా కింద సుమారు రూ.284కోట్లు చెల్లించేందుకు జనవరి 23న ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కారు. ఇప్పటివరకూ మూడు నెలలు కావస్తున్నా డ్వాక్రా మహిళలకు డబ్బులు జమకాలేదు. జిల్లాలో కొన్ని సంఘాలకు రుణమాఫీ కూడా జరగలేదు.

నిరుపయోగంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్

సీఎం జగన్ గతేడాది జూలై 8న జిల్లాలో రెండోవిడత వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో సాంకేతిక పరికరాలు, కెమికల్స్, గ్లాస్‌వేర్ సామగ్రి, ఫర్నీచర్స్ వంటివి లేక దిష్టిబొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట ప్రాంతాల్లోని వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి పరీక్షలు చేయడానికి అవసరమైన సామగ్రి లేక నిరుపయోగంగా ఉన్నాయి.




టెక్కలిలో అగ్రిల్యాబ్

అతీగతీ లేని ఫిషింగ్ హార్బర్

ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట ప్రాంతాల్లో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సీఎం జగన్ ఏడాది కిందట వర్చువల్‌గా శంకుస్థాపన చేసినా పనులు ముందుకు సాగడం లేదు. 'బుడగట్లపాలెం వద్ద సుమారు 40 ఎకరాల్లో రూ.332కోట్ల వ్యయంతో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తాం. రూ.786కోట్లు ద్వారా రోజుకు 26,100 మెట్రిక్‌టన్నుల చేపలవేట చేసి.. పదివేల మంది మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామ'ని గతంలో వైసీపీ నేతలు ప్రకటించారు. కానీ హార్బర్ పూర్తికాలేదు. మంచినీళ్లపేట వద్ద మట్టిదిబ్బలతో వదిలేశారు.

సింగూరులో ఇసుక దోపిడీ

- పోలీసు అధికారి పేరు చెప్పి వైసీపీ నేత దందా
- రోజుకు రూ.15లక్షల మేర నిల్వలు అక్రమ తరలింపు



నాగావళి నదిలో ట్రాక్టర్‌లోకి ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

నది నుంచి ఇసుకలోడ్‌తో వెళ్తున్న లారీ

(పొందూరు)

ఎన్నికల హడావుడి వేళ.. కొంతమంది వైసీపీ నేతలు ఇసుక దోపిడీకి తెరలేపారు. ఓ పోలీసు అధికారి పేరు చెప్పి.. దందా సాగిస్తున్నారు. అనుమతుల్లేకుండానే రోజుకు రూ.15 లక్షల మేర ఇసుక నిల్వలు అక్రమ రవాణా చేస్తున్నారు. అధికార పార్టీ అండ ఉండడంతో ఈ అక్రమాలను అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. పొందూరు మండలం సింగూరులోని నాగావళి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఇక్కడ ఉన్న ర్యాంపు కొద్దినెలల కిందట నిలిచిపోయింది. ప్రస్తుతం అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో.. తమకు అడ్డులేదని భావించి స్థానిక వైసీపీ నాయకుడు ఇక్కడ ఇసుక ర్యాంపు నిర్వహణకు సిద్ధమయ్యాడు. ఒక పోలీసు అధికారి పేరును అడ్డుపెట్టుకుని.. ఆయనకు తెలియకుండానే వారి కుటుంబ సభ్యులను ఇందులో భాగస్వామ్యం చేశాడు. దీనిపై కొందరు స్థానికులు అధికారులకు రహస్యంగా ఫిర్యాదు చేశారు. కానీ నేరుగా అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో ఇటీవల ఓ కంపెనీ పేరు రశీదులతో.. అనుమతులు లేకపోయినా.. రోజూ సుమారు 80 పెద్ద లారీలు, వందకు ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు రూ.15లక్షలకుపైగా సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది మైనింగ్, విజిలెన్స్ అధికారులకు ముడుపులు అందుతుండడంతో.. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ విషయమై పొందూరు తహసీల్దార్ ఎం.కిరణ్‌పాల్ వద్ద ప్రస్తావించగా.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు జిల్లాకు షర్మిల రాక

- టెక్కలి, పలాసలో పర్యటన

శ్రీకాకుళం క్రైం/ టెక్కలి, ఏప్రిల్ 27: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం జిల్లాకు రానున్నారని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎన్నికల ప్రచారంలో భాగంగా షర్మిల న్యాయ యాత్ర చేపడుతున్నారు. ఈ మేరకు జిల్లాలోని టెక్కలి, పలాసలో పర్యటించనున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు టెక్కలిలోని ఇందిరా గాంధీ కూడలిలో బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం రాత్రి 7 గంటలకు పలాస చేరుకుంటారు. అక్కడ పాత బస్టాండ్ ఆవరణలో నిర్వహించనున్న సభలో ప్రసంగిస్తారు. పర్యటనలో ఇండియా కూటమి నాయకులు పాల్గొనున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి షర్మిల పర్యటనను విజయవంతం చేయాల'ని పేడాడ పరమేశ్వరరావుతో పాటు కేంద్ర మాజీమంత్రి కిల్లి కృపారాణి కోరారు.



● పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి ల్యాండ్‌మార్క్‌గా నిలిచే మూడురోడ్ల జంక్షన్ వద్ద కాలువ దుస్థితి ఇది. చెత్తా, చెదారం పేరుకుపోయి అధ్వానంగా మారింది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఇక్కడ పాదచారులు, వాహన చోదకులు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. పలాస రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికులు, విశాఖ, సోంపేట, ఇచ్ఛాపురం వైపు వేలాది మంది ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యంరద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ గాలికొదిలేయడంపై జంటపట్టణ వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గతంలో సీఎం జగన్ పలాస వచ్చిన సమయంలో కాలువపై రెండు పలకలు వేసి వదిలేశారు. కానీ అంత కుమించి గత ఐదేళ్లలో కాలువలో మురుగు తొలగించి, ప్రజల కష్టాలు తీర్చే ప్రయత్నం చేయలేదని స్థానికులు చెబుతున్నారు.

గత ఐదేళ్లలో పలాస-కాశీబుగ్గను గణనీయంగా అభివృద్ధి చేశామని మంత్రి అప్పలరాజు తరచూ గొప్పలు చెబుతుంటారు. కానీ, ఇక్కడ వాస్తవ పరిస్థితి వేరేలా ఉంది. ఇతర సౌకర్యాలు దేవుడెరుగా కనీసం మురుగు కాలువలు ఇక్కడ లేవు. జంట పట్టణాల్లోని ప్రతీ వీధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి పలుచోట్ల కాలువలు పూర్తిగా కప్పబడిపోయాయి. ఐదేళ్లుగా మునిసిపాలిటీలో ఒక్కచోట కూడా కాలువ నిర్మించలేదు. దీంతో జనవాసాలు, రోడ్లపైకి మురుగునీరు చేరుతుంది.

కాలువలేవీ అమాత్యా?

- పలాస-కాశీబుగ్గలో డ్రైనేజీ అస్తవ్యస్తం
- రోడ్లు, జనావాసాల్లోకి మురుగు
- ఐదేళ్లలో ఒక్క కాలువ కూడా నిర్మించని వైనం
- పట్టించుకోని పాలకులు
- జంట పట్టణ ప్రజలకు తప్పని అవస్థలు

(కాశీబుగ్గ)

పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల జనాభా గణనీయంగా పెరుగుతోంది. చుట్టుపక్కల మండలాల నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం వస్తోన్న వారిలో చాలామంది ఇక్కడే స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో పట్టణ శివారు విస్తరిస్తోంది. అయితే ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా మునిసిపాలిటీలో జనాభా అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. ముఖ్యంగా అనేక వార్డుల్లో మురుగు కాలువలు లేవు. దీంతో తరచూ రోడ్లపైకి మురుగు చేరుతుంది. పారిశుధ్య నిర్వహణను సమర్థంగా చేపట్టేందుకు మునిసిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. ప్రధానంగా ప్రవాహనికి ఆటంకం కలుగుతుంది. వర్షం కురిసినా, ఎక్కువగా మురుగునీరు వచ్చినా రోడ్డుపైకి చేరుతుండడంతో పాదచారులు, వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. వర్షాకాలంలో మురుగు నీరు పొంగి సమీపంలోని నివాసాలు, దుకాణాల్లోకి చేరుతుంది. ఆ సమయంలో ఇక్కడ జనజీవనం అస్తవ్యస్తంగా మారుతుంది.



● పాత జాతీయరహదారిపై పోస్టాఫీసు, మేదరవీధి సమీపంలో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పిందనడానికి ఈ చిత్రమే సాక్ష్యం. కనీసం అక్కడ కాలువ ఉన్న ఆనవాళ్లు కూడా లేవు. కొంతమంది ఇక్కడ కాలువపై చెత్తను వేసేయడంతోపాటు ఆక్రమించేశారు. దీంతో జంటపట్టణాల్లోని పలుప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు





రోడ్ల విస్తరణ పేరుతో కాలయాపన..

జంట పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. పట్టణ ప్రజల అవసరాలకు తగ్గట్లుగా కాలువలు లేవు. ఐదేళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్ల విస్తరణ పేరుతో కాలయాపన చేశారు. మునిసిపాలిటీలో ఇతర సమస్యలను గాలికొదిలేశారు. కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్‌లో పరిస్థితి చాలా దారుణంగా ఉంది.

-లొడగల కామేశ్వరరావు యాదవ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ప్రకటనలతో కాలం గడిపేశారు..

పేరుకే బి-గ్రేడ్ మునిసిపాలిటీ. కానీ ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులు ఇక్కడ లేవు. పాలకులు మాత్రం ఆర్భాట ప్రకటనలతో కాలం గడిపేశారు. ప్రధానంగా కాలువలు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఇళ్లలోకి వరద వచ్చేస్తుంది.

-సవర రాంబాబు, టీడీపీ జిల్లా పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు

కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్, పోస్టాఫీసు వీధి, పాతబస్టాండ్, అక్కుపల్లి రోడ్డు, పలాస ఆర్టీసీ కాంప్లెక్స్, ఉదయపురం తదితర ప్రాంతాల్లో కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. పారిశుధ్య పనులు కూడా ప్రధాన ప్రాంతాలకే పరిమితమయ్యాయనే విమర్శలు ఉన్నా యి. శివారు ప్రాంతాలు, రోడ్లు అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో చెత్త తొలగించడంలేదని పట్టణ వాసులు వాపోతున్నారు.



కాశీబుగ్గ శ్రీనివాసనగర్‌లో రోడ్డుపై చెత్తాచెదారం

వైసీపీ పాలకుల నిర్లక్ష్యం..

జిల్లాలో విస్తీర్ణపరంగా అతిపెద్ద బి-గ్రేడ్ మునిసిపాలిటీగా పలాస గుర్తింపు పొందింది. 2000 సంవత్సరంలో ఏర్పడిన ఈ మునిసిపాలిటీలో 31 వార్డులు ఉన్నాయి. 57,507 మంది జనాభా, 44 వేల ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకూ నాలుగు పాలకవర్గాలు ఏర్పడ్డాయి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాధారణ నిధులు సైతం ప్రభుత్వ అవసరాలకు వినియోగించడం లేదు. ఆర్థిక సంఘం నిధులను మళ్లించడంతో కాలువలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. వీధుల్లో కనీస మౌలిక వసతులు మృగ్యమయ్యాయి. రోడ్ల విస్తరణతోపాటు కాలువలు నిర్మిస్తామని ఆర్భాటమే తప్ప ఆచరణలో కనిపించడం లేదు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెరిగిన పట్టణ అవసరాలకు తగ్గట్లుగా జంట పట్టణాల్లో వసతులు కొరవడ్డాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. నగరపంచాయతీగా ఉన్న సమయంలో నిర్మించిన కాలువలు, వసతులే నేటికీ కనిపిస్తున్నాయి. అప్పట్లో 20 వేల మంది జనాభా ఉండేవారు. కాలువలు కూడా అప్పటి అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు జనాభా పెరగడంతో మురుగు కాలువల సామర్థ్యం సరిపోవడంలేదు.



కాశీబుగ్గ ఒడియా స్కూల్ వద్ద పిచ్చి మొక్కలతో నిండిన కాలువ

పెద్ద నోటు - ఈసారి లోటు




గార: ఎన్నికలొచ్చాయంటే నగదు, మద్యానిదే కీలక భూమిక. నోటిఫికేషన్ మొదలు ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లే వరకూ ఈ రెండే ప్రభావం చూపిస్తుంటాయి. ఓటర్లను దారి లోకి తెచ్చుకోవాలన్నా.. ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం అంతా ఇంతా కాదు. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులివి. అభ్యర్థుల అదృష్టమో.. ఓటరు దురదృష్టమో తెలియదు గానీ ఈ ఎన్నికల్లో పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 సాధారణ ఎన్నికల్లో పెద్ద నోటు అంటే వెయ్యి ఒక్కటే. ఆ తరువాత నోట్ల రద్దుతో వెయ్యి నోటు అడ్రస్ లేకుండా పోయింది. 2019 ఎన్నికల నాటికి రూ.2 వేల నోటు వచ్చింది. ఇప్పుడు అదీ కనిపించడం లేదు. జేబులోకి చెయ్యి పోనిస్తే రూ.500 నోటు లేదా రూ.200 నోటు పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఓటరుకైనా, నాయకుడికైనా పెద్ద నోటు ప్రస్తుతానికి ఇదే. అలాగని ఒకటో, రెండో నోట్లు ఇచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు ఇప్పుడు పెద్ద నోట్ల వేటలో పడ్డారు.

'ఆత్మీయత' ఓ నాటకం!



రణస్థలం: అనుబంధం.. ఆత్మీయత...అంతా ఓ బూటకం' అన్నాడో సినీ కవి. అనుబంధం సంగతి ఎలా ఉన్నా.. ప్రస్తుత ఎన్నికల సమయంలో 'ఆత్మీయత' మా త్రం ఓ నాటకమే నన్నది అక్కడక్కడా చోటుచేసుకుంటున్న 'రాజకీయ' సంఘటనలను బట్టి తెలుస్తోంది. ఈ మాటల్లో నిజమెంతో తెలియాలంటే... ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఎత్తుగడలు చూస్తే చాలు. ఓవైపు అభ్యర్థి ఖర్చులపై ఎన్నికల కమిషన్ నిఘా...మరోవైపు పైసలు తీయకపోతే 'కార్యకర్తలు' కరువైపోయే పరిస్థితి. ఇది పోటీలో ఉన్న వారికి మింగుడు పడడం లేదు. అందుకే తాజాగా నాయకులు 'ఆత్మీయ సమావేశాల'ను ఎంచుకుంటున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తమతో వస్తున్న కార్యకర్తలందరికీ మద్యం, బిర్యాని, డబ్బులు ఇచ్చేందుకు పుట్టిన రోజులు, పెళ్లి రోజులు అని చెప్పి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశాల్లో నాయకులు తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. అనంతరం కార్యకర్తలందరికీ మద్యం, బిర్యాని, డబ్బులు పంపిణీ చేస్తున్నారు. ఇది ఎన్నికల వ్యయం కింద రాకుండా జాగ్రత్త పడుతున్నారు.


ఎవరికి ఓటు వేశామో తెలుసుకోవచ్చు



నరసన్నపేట: ఈవీఎంలో మనం ఎవరికి ఓటు వేశామో చూసుకోవచ్చు. నచ్చిన అభ్యర్థి పార్టీకి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఓటరు వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) ద్వారా కల్పిస్తోంది. వేసిన ఓటును చూసుకునే అవకాశం ఏడు సెకన్ల వరకు మాత్రమే ఉంటుంది. అనంతరం ఆ ఓటు వీవీ ప్యాడ్ బాక్స్‌లో పడిపోతుంది. ఈ విధానాన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలాండ్‌లో నోక్సెల్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాలలో అమలు చేశారు. ఆ తరువాత దశల వారీగా అంతటా అమల్లోకి వచ్చింది. వేసిన ఓటును సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించడం, బహిర్గతం చేయడం మాత్రం నిషేధం. ఉల్లంఘిస్తే ఓటు రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది.

వీధుల్లో మైక్‌లు.. ఇళ్లలో సెల్‌ఫోన్లు


- ప్రచారంతో హోరెత్తిస్తున్న అభ్యర్థులు
- విసుగుచెందుతున్న సగటు ఓటరు



(వజ్రపుకొత్తూరు)

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తికావడంతో ప్రచారంపై రాజకీయ పార్టీలు దృష్టిసారించాయి. గతానికి భిన్నంగా పార్టీల అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. వీధుల్లో మైక్‌లతో హోరెత్తిస్తుండగా, ఇళ్లలో ఉండే సెల్‌ఫోన్లకు అభ్యర్థులు ఫోన్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికావడం, స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఇంటా ఉండడంతో అభ్యర్థులు వాట్సాప్ ద్వారా ప్రతి అంశం షేర్ చేస్తున్నారు. తమకు ఓటు వేస్తే చేయబోయే అంశాలను ఐవీఆర్ ద్వారా వివరిస్తున్నారు. వారంరోజులుగా ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థుల తరఫున ఆయా పార్టీల మద్దతుదారులు, పార్టీ కార్యాలయాల ప్రతినిధులు ఫోన్‌చేసి వచ్చే నెల 13న జరిగే పోలింగ్‌లో తమ అభ్యర్థికి ఓటు వేయాలని పదేపదే కోరుతున్నారు. దీనివల్ల ఫోన్‌రింగ్ అవుతున్న సమయంలో లిఫ్ట్ చేసేందుకు చాలామంది ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. గుర్తుతెలియని నంబరు నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయడానికి ఇష్టపడడం లేదు. బంధువులు, స్నేహితులు పను లపై చేసే సమయంలో కూడా ఈ నెంబరు ఎవరిదోనని తికమకప డుతున్నారు. ప్రశాంతతను కోరుకునే గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటారు. కొద్దిరోజులుగా ఎక్కువ సార్లు ఫోన్లు వస్తుండడంతో విసుగు చెందుతున్నారు.


తొలి ఎన్నికల్లో ఏమైందంటే..



(నరసన్నపేట)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం 1957లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పుడు రాష్ట్రంలో 55,61,345 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా... 36,03,585 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. మరి ఇప్పుడో...ఈ ఓటర్ల సంఖ్య ఒక జిల్లా ఓటర్లతో సమానం.. నాటికీ నేటికీ ఎంత తేడా. 1957లోని మరికొన్ని విశేషాల సమాహారం కొత్తతరం ఓటర్ల కోరం..

- 1957లో ఏపీలో 85 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.
- రాష్ట్ర వ్యాప్తంగా 47.67 శాతం పోలింగ్ నమోదైంది..
- మొదటి అసెంబ్లీ నియోజకవర్గంగా కల్వకుర్తి, చివరి అసెంబ్లీ నియోజకవర్గంగా దేవరకొండ ఉండేవి.
- రాష్ట్ర వ్యాప్తంగా 493 మంది నామినేషన్లు వేయ గా... వాటిలో 174 తిరస్కరణకు గురయ్యాయి. ఒక్కరు కూడా నామినేషన్ ఉపసంహరించుకోలేదు.
- పోటీ చేసిన 319 మంది అభ్యర్థులలో 81 మంది డిపాజిట్లు కోల్పోయారు.
- రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది మహిళలు పోటీ చేయగా.. వారిలో ఏడుగురు విజయం సాధించారు.
- మూడు నియోజకవర్గాల్లో ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే ఎన్నికల బరిలో ఉండడంతో వారు ఏకగ్రీవంగా శాసనసభ్యుల య్యారు.
- 18 నియోజకవర్గాలలో ఇద్దరేసి అభ్యర్థులు పోటీ చేశారు. 25 స్థానాలలో ముగ్గురేసి, 21 స్థానాలలో నలుగురేసి, మూడుస్థానాలలో అయిదుగురు, 15 స్థానాలలో ఆరు నుంచి పదిమంది ఎన్నికల బరిలో పోటీచేశారు.
- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో) నియోజకవర్గం నుంచి అత్యధికంగా పది మంది అభ్యర్థులు పోటీ చేశారు.
- మొత్తం 85 నియోజకవర్గాలలో 18 స్థానాలు ఎస్సీలకు, రెండు స్థానాలు ఎస్టీలకు కేటాయించారు.
- కాంగ్రెస్‌కు 47.38 శాతం ఓట్లు పడ్డాయి. ప్రజా సోషలిస్ట్ పార్టీకి 5.65 శాతం, భారతీయ జనసంఘ్‌కు కేవలం 0.16 శాతం ఓట్లు పోల య్యాయి. ప్రాంతీయ పార్టీ పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు 36.46 శాతం ఓట్లు వచ్చాయి.



జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఆదివారం 28 ఏప్రిల్ 2024



మబగాం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు

మీకు తెలుసా?

నరసన్నపేట: పోలాకి మండలం మబగాం గ్రామానికి చెందిన ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, బగ్గు రమణమూర్తి నరసన్నపేట నియోజవర్గానికి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. ధర్మాన ప్రసాదరావు 1989-94, 1999-2004 వరకు నరసన్నపేట ఎమ్మెల్యేగా పని చేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ధర్మాన కృష్ణదాస్ 2004-14 వరకు, 2019 నుంచి ప్రస్తుత ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, నరసన్నపేట నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి 2014-19 వరకు నరసన్నపేట ఎమ్మెల్యేగా పని చేశారు.

అప్పుడలా.. ఇప్పుడెలా..

- గతంలో డబ్బులు, మద్యం పంచేవారు కాదు
- పార్టీపై అభిమానం.. నాయకుడిపై నమ్మకం కొట్టొచ్చేది
- ప్రస్తుతం మారిన పరిస్థితి



నరసన్నపేట: రెండు దశాబ్దాల కిందట వరకూ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బుల పంపకాలు లేవు. యథేచ్ఛగా మందు పంపిణీ లేదు. సగటు పౌరుడిలో పార్టీ మీద అభిమానం, నాయకుడి మీద నమ్మకం కొట్టొచ్చినట్లు కనిపించేది. ప్రజాస్వామ్యంపై అపారగౌరవం ఉండేది. నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే మంచి జరుగుతుందన్న విశ్వాసం కనిపించేంది. పార్టీ పిలుపు కోసం అహర్నిశలు పాటుపడే మనస్తత్వం ఎక్కువ మందిలో ఉండేది. ఆ రోజుల్లో రవాణా సదుపాయాలు లేకపోయినా, కాలినడకన వాగులు.. వంకలు దాటుకుంటూ ప్రచారం చేసేవారు. ఈ క్రమంలో గెలిస్తే సంతో షం, ఓడిపోతే మలిదశలో విజయం సాధించాలనే తాపత్రయం కనిపించేది. ఇటు వంటి కార్యకర్తలు, వారి నమ్మ కాన్ని చూరగొన్న నాయకులు ప్రస్తుతం కనుమరుగయ్యారు. ప్రస్తుతం ఓటరు మనస్సులు సమూలంగా మారిపోయాయి. నాయకులు నాడి కూడా అంతుపట్టడంలేదు.

పరిస్థితులు పూర్తిగా మారిపోయాయ్

ప్రస్తుతం రాజకీయాల్లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నాయి. అంతా కిరాయి వ్యవహారంగా మారిపోయింది. పార్టీలు, జెండాలు నాయకులు ఇచ్చే ప్రసంగాలు మారుతు న్నాయి. ఏ ఎండకు ఆ గొడుగులా ఏ పార్టీకి జెండాలు, విధానాలు మారిపోతున్నాయి. నాటి రోజుల్లో ఓ కట్టుబాటు ఉండేది. ప్రస్తుతం ఎవరు ఎప్పుడు పార్టీలు మారుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కార్యకర్తలు కూడా నాయకులు కంటే రెండాకులు ఎక్కువే చదివారు. అప్పట్లో ఓ పార్టీకి ఇన్ని ఓట్లు వస్తాయన్న లెక్కకు అంచనాఉండేది. ఐదోపదో తరగొచ్చు.. పెరగొచ్చు అనుకునేవాళ్లు. ఓటరు నాడి కూడా దొరికేది. కానీ నేడు ఓటరు నాడి పట్టే పరిస్థితులు ఇచ్చే డబ్బులపై కూడా ఆధారపడుతోంది. ఓట్లకు ఏ నాయకులు ఎన్ని నోట్లు పంచుతారో అన్న అంచనాలు, చర్చలు తప్ప ఎవరు సాధ్యుడు ఎవరు అసాధ్యుడు, ఎవరి ప్రజలు మేలు కోరే వారు, ఎవరి సత్తా ఎంత అన్న అంశాలపై చర్చించే అవకాశం లేకుండా పోయింది. వారిని బట్టే ఎన్నికల బరిలో దిగే వారు కూడా గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. అదే మంటే .. ఊరకనే ఓటు వేశారా.. డబ్బులు తీసుకున్నారు.. ఓట్లు వేశారు.. మళ్లీ ఎలక్షన్ వస్తే ప్రత్య ర్థికంటే అదనంగా సొమ్ములు ఇచ్చి ఓటు కొంటామనే ధోరణి నేటి నాయకుల్లో కనిపిస్తుంది. పార్టీలు మారే నేతలను ప్రజలు ఎంతవరకు నమ్ముతారు. ఆ మార్పులు ప్రజల కోసమా లేక తమ స్వార్థ రాజకీయల కోసమా అనే ఆలోచించే వారు చాలా తక్కువ శాతం ఉన్నారన్నది నగ్న సత్యం. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఎంతో కొంత నమ్మి నాయకులను ఓటు వేసి గెలిపించారు. వారు మాత్రం వారి నమ్మకాన్ని ఒమ్ము చేశారన్నది సత్యం.. ఇది ఈ నాటి నాయకులు పరిస్థితి.

ఓటు.. నడిపిస్తున్న నోటు!

- ఎన్నికల్లో డబ్బే కీలకం
- సమయం తక్కువ.. ఖర్చు ఎక్కువ

(శ్రీకాకుళం-ఆంధ్రజ్యోతి)





'అన్నిసార్లూ ఓటు రూ.500కే దొరకదు. ఒక్కోసారి పరిస్థితులను బట్టి ఓటుకు రూ.1000 ఇవ్వాలి. అవసరమైతే రూ.5000 కూడా ఇవ్వాలి. అధికారం కావాలంటే ఎన్ని వందల కోట్లయినా ఖర్చు పె ట్టాలి..' ఇవీ ఓ సినిమాలో కథానాయకుడు అన్న మాటలు. సినిమా డైలాగులను పక్కన పెడితే.. అంతగా ఖర్చు చేయకపోయినా భారీగా డబ్బు లేనిదే ఎన్నికలు లేవన్నది వాస్తవం... డబ్బుకు లోకం దాసోహం అన్నారు. ఎన్నికల వేళ కోట్లు ఖర్చు చేసేందుకు నేతలు సి ద్ధంగా ఉన్నారు. ఎన్నికల సంఘం జిల్లాకు ముగ్గురు ఐఆర్ఎస్ అధి కారులను వ్యయ పరిశీలకులుగా నియమించింది. వీరిలో కేకే శ్రావ ణ్‌కుమార్ (శ్రీకాకుళం పార్లమెంట్), కోమల్జీత్ మీన శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాలు, నవీన్‌కు మార్‌సోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గా ల్లో అభ్యర్థులు ఖర్చులను లెక్కిస్తున్నారు. వీరే కాకుండా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ ఆదేశాలతో అధికార యంత్రాంగ నిఘాతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

జిల్లాలో పరిస్థితి

జిల్లాలో అధికార వైసీపీ, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేశారు.



కాంగ్రెస్ తదితర పార్టీలు సైతం తమదైన రీతిన ప్రచారం ప్రారంభించాయి. అధికారం దక్కించుకోవాలని తెలుగుదేశం కూటమి అభ్యర్థులు... రెండోసారి విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని వైసీపీ అభ్యర్థులు ఎన్నికల కురుక్షేత్రంలోకి దిగాయి. ఈ ఎన్నిక లో ఎంత ఖర్చు చేయగలరో తెలుసుకుని కొన్ని పార్టీలు టికెట్లు ఇస్తున్న నేప థ్యంలో ఈసారి డబ్బు ఏరులై పా రడం కచ్చితమని తేలుతోంది. మరి అభ్యర్థుల ఖర్చు ఎలా ఉండాలో.. ఎంత ఉంటోందో ఓసారి చూద్దామా?

అధికారికంగా...

ఎమ్మెల్యేగా పోటీలో ఉన్న అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీగా బరిలో ది గిన అభ్యర్థి రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని ఎన్నికల సంఘం నిబంధన. ఈ ఖర్చులు రికార్డులకే పరిమితం. వాస్తవంగా జరు గుతున్న ఖర్చు ఎంతనేది జగమెరిగిన సత్యం. పాదయాత్రలు, బహిరంగ సభలు, రోజువారీ కార్యకర్తలు, నాయకుల ఖర్చులు, పార్టీ కార్యక్రమాల ని ర్వహణ, ప్రచారం ఖర్చులు... వాహనాల పెట్రోల్... ఇలా అన్నీ కలిపి అంచనాలు దాటుతాయి. ఇక నామినేషన్ వేసిన ఒక్క రోజు చేసిన ఖర్చు అతని స్థాయిని తెలియజేస్తుంది. ఇదే గెలుపోటములపై ప్రజల్లో ఓ అంచనా వేసేందుకు కీలకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

ఎంపీ నియోజకవర్గాల్లో..

శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని ఏడు నియోజక వర్గాలు ఉన్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గం మాత్రం విజయనగరం పార్ల మెంట్ పరిధిలో ఉంది. ఎంపీ అభ్యర్థి తన పరిధిలోని అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఖర్చులను కూడా కొంతమేర భరించాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందనడం అతిశ యోక్తి కాదు.

జిల్లాలో రూ.600 కోట్లు పైమాటే..

ఎనిమిది నియోజకవర్గాల్లో రెండు ప్రధాన పార్టీల నుంచి 16 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. వీరే సుమారు రూ.400 కోట్లు వరకు ఖర్చు చేస్తారన్నది ఓ అంచనా. ఇతర పార్టీల అభ్యర్థులను పరిశీలిస్తే మరో రూ.పదికోట్లు ఖర్చు చేసే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి రెండు ప్రధాన పార్టీల ఖర్చు ఇప్పటికే సుమారు రూ.100 కోట్లు దాటిందనడం సందేహం లేదు. అధికార పార్టీ అభ్యర్థులు నియోజకవర్గంలో కనీసం రూ.50 కోట్లు .. ఆపై ఖర్చు చేసేందుకు కూడా వెనుకంజ వేయడం లేదన్నది వాస్తవం.

కులపోలూ.. సాయం చేయండి

- ఓటర్లకు ఎర వేస్తున్న రాజకీయ పార్టీలు

(టెక్కలి)



సార్వత్రిక ఎన్నికలు వేళ రాజకీయ పార్టీలు ఓటర్లకు అనేకరకాలుగా ఎరలు వేస్తున్నారు. ముఖ్యంగా ఆయా కులాల మద్దతు కోసం అన్ని రాజకీయ పార్టీలు హైరానా పడుతున్నాయి. ఆయా ప్రధాన కులాల మద్దతు తమకే తెలియజేయాలని కులాల వారీగా ఆయా రాజకీయ పార్టీలు సమావేశాలు నిర్వహిస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని కులాలను బీసీల్లో చేరుస్తామని, మరికొన్ని కులాలను ఓబీసీల్లో చేరుస్తామని, ఇప్పటివరకు బీసీల్లో చేర్చిన ఘనత తమ పార్టీదేనని నాయకులు హామీల మీద హామీలు గుప్పిస్తున్నారు. ఇదే అదునుగా పలు కులస్తుల వారు రాజకీయ పార్టీల చుట్టూ తిరుగుతూ హామీలు పొందుతున్నారు. చిన్న, పెద్ద తేడాలేకుండా ఆయా కులాల వారు అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు వ్యాపార, వర్తకులకు అనుకూలంగా ఉంటామని, ఎటువంటి పరిస్థితుల్లోనైనా తాము అండగా ఉంటామని హామీలు గుప్పిస్తున్నాయి. విందుభోజనాలను సైతం కులపోలుకు అందించేందుకు పాకులాడుతున్నారు. ఈ ఎన్నికల్లో కుల సంఘ నాయకులదే ముఖ్య భూమికగా ఉంది. అయితే ఈ కుల సమావేశాలను కొందరు బహిరంగంగా, మరికొందరు గోప్యంగా నిర్వహిస్తుండడం విశేషం.

భారతపౌరుడే పోటీ చేయాలి

(శ్రీకాకుళం)

మీకు తెలుసా?

రాజ్యాంగంలోని 84 (ఎ) ప్రకారం భారతపౌరుడు కాని వ్యక్తి పార్లమెంటు ఎన్నికలలో అభ్యర్థిగా పోటీచేసే వీలులేదు. రాజ్యాంగంలోని 173 (ఎ) ప్రకారం శాసనసభకూ ఇదే నిబంధన వర్తిస్తుంది.

- ప్రజా పాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 4 (బి) ప్రకారం ఏ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాని వ్యక్తి పోటీకి అనర్హుడు.
- ప్రజాపాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 4 (సి), 4 (సిసి), 4 (సిసిసి) ప్రకారం ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మరొక రాష్ట్రంలో పోటీచేసే వీలుంది. అయితే ఈ సెక్షన్ల ప్రకారం అసోం, లక్షదీవులు, సిక్కిం రాష్ట్రాలలో పోటీ చేసేందుకు వీలుకాదు.
- జైలులో ఉన్న వ్యక్తి గానీ... ఒక జైలు నుంచి మరొక జైలుకు తరలుతున్న వ్యక్తి గానీ... పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి గానీ ఓటు వేయడానికి వీలులేదు.

- రిజర్వాయర్లను పట్టించుకోని వైసీపీ సర్కారు
- కనీస నిధులు విడుదల చేయని వైనం
- దెబ్బతిన్న కాలువలు, తూములు
- బీడుగా రైతుల భూములు
- ఇదీ వెన్నెలవలస, బొమ్మిక జలశయాల పరిస్థితి

ఐదేళ్లుగా నిర్లక్ష్యం



వెన్నెలవలస జలాశయం గట్టుపై పెరిగిన చెట్లు

సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లోని వెన్నెలవలస, బొమ్మిక రిజర్వాయర్లను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీనివల్ల ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. మెట్ట ప్రాంత భూములకు నీరందించేందుకు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ రిజర్వాయర్లు నిరుపయోగంగా మారాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా కనీసం కాలువలు మరమ్మతులకు కూడా నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా రెండు జలశయాల కింద వందలాది ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి.

సరుబుజ్జిలి: మండలంలోని వెన్నెలవలస గిరిజన గ్రామం ఎగువ భాగంలో ఐరోపా ఆర్థిక సాయంతో 1987 ఆగస్టు 24న అప్పటి మంత్రి కేతు కృష్ణమూర్తి వెన్నెలవలస జలాశయం కోసం శంకుస్థాపన చేశారు. ఏడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీటిని జలాశయానికి మళ్లించి సరుబుజ్జిలి మండలంలోని 12 గ్రామాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో ఈ రిజర్వాయర్‌ను నిర్మించారు. వెన్నెలవలస, శ్రీరామవలస గ్రామాల మధ్య రెండు కొండల నడుమ నాలుగు వందల మీటర్ల గట్టు ఏర్పాటు చేశారు. జలాశయానికి ఇరువైపులా కుడి, ఎడమ కాలువలు నిర్మించి తూములు ఏర్పాటు చేసి 12 గ్రామాల్లో సుమారు 350 ఎకరాలకు సాగునీరందించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ జలాశయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం నిర్వహణ లేక జలాశయం గట్టు ముళ్లపొదలతో నిండిపోయింది. పిల్ల కాలువ తూములు అధ్వాన స్థితికి చేరాయి. దీంతో రిజర్వాయర్ నిరుపయోగంగా మారింది. జలాశయంలో నీరు చేరకపోవడం, కాలువలు పాడవడంతో ఏటా ఖరీఫ్‌లో వరి పంట ఎండిపోతుంది. దీంతో వెన్నెలవలస, శ్రీరామువలస, మత్రిపాడు, బురిడివలస, చిగురువలస, మూలసవ లాపురం, సింధువాడ, షలంత్రి గ్రామాలకు చెందిన 255 మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నిసార్లు పాలకులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

చుక్కనీరు ఇవ్వని 'బొమ్మిక'

బూర్జ మండలం బొమ్మి గిరిజన గ్రామం ఎగువ భాగంలో గజిలిగెడ్డపై 1988లో రూ.130 లక్షల అంచనాతో బొమ్మిక జలాశయం నిర్మించారు. పది నుంచి 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో కురిసే వర్షపునీటిని జలాశయంలోకి మళ్లించి కొండపేట, మదనాపురం, పెద్దపేట, జగన్నాథపురం, అప్పలపేట తదితర గ్రామాల్లోని 565 మంది రైతులకు చెందిన 800 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జలాశయానికి అమర్చిన రెండు మదుములు నాణ్యత కోల్పోవడంతో లీకులమయమై నీరు వృథాగా బయటకుపోతుంది. దీంతో ఆయకట్టుకు ప్రస్తుతం చుక్కనీరు అందని పరిసితి నెలకొంది. పాలకొండ నుంచి సరుబుజ్జిలి వ చ్చే దారి ఎడమ వైపు ఉన్న రెండు జలశయాలు పర్యాటకులు చూడడానికి తప్ప ఆయకట్టుకు నీరందని దుస్థితి ఏర్పడింది.



శిథిలావస్థలో వెన్నెలవలస జలాశయ మదుము



బొమ్మిక జలాశయంలో నీరు లేక బీటలు వారుతున్న చెక్‌డ్యామ్



ముళ్లపొదలతో నిండిన బొమ్మిక జలాశయం గట్టు



వెన్నెలవలస జలాశయంలోపల భాగంలో మూసుకుపోయిన కల్వర్టు పైపు

యువతకు ఉపాధి కల్పిస్తా

● కూటమి ఎచ్చెర్ల అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు



ఎన్డీఏ కూటమిలో చేరిన జేఆర్‌పురం యువతతో ఎన్ఈఆర్

రణస్థలం: యువతకు అండగా ఉండి, ఉపాధి కల్పించి రాజకీయాల్లో మార్పు తీసుకొస్తానని ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జేఆర్‌పురం గ్రామానికి చెందిన పలువురు యువకులు, వ్యాపారులు వైసీపీని విడిచి శనివారం రాత్రి ఎన్డీఏ కూటమిలో చేరారు. పైడిపల్లి రమణ, తవుడు, ముసులోడు, పైడిపల్లి రామారావు, జయ రాజు, మింద్రాన గోవింద తదితరులకు ఎన్ఈఆర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరినీ అన్ని విధాలా అదు కుంటానని, అధైర్య పడవద్దని, ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి రానున్న ఎన్నికల్లో కూటమి విజయానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేగా తనకు కమలం, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా.. ఆదరించండి

● నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్న పేట: పట్టణంలో ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ.. అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కోరారు. శనివారం పట్టణంలోని మారుతీనగర్ 1, 2 వీధులు, లక్ష్మీనగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. టీడీపీ హయాంలో పట్టణంలోని వ్యాపారులు, ఉద్యోగులు ఎటువంటి భయం లేకుండా తమ పని తాము చేసుకున్నారన్నారు. పట్టణంలో ఉన్న పేదలను ఆదుకునేందుకు సూపర్ సిక్స్ పథకాలను గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఉణ్న రాజశ్రీ, గొద్దు చిట్టిబాబు, నేతలు జామి వెంకట్రావు, బోయన ఆనంద్, బెవర రాము, పీస కృష్ణ, బోయన సతీష్ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ సీనియర్ నేత, ఉప సర్పంచ్ శాసుపల్లి కృష్ణబాబు శనివారం తన అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకోగా వారికి ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. ● **జలుమూరు (సారవకోట):** పరిపాలనానుభవం కలిగిన టీడీపీ అధినేత చంద్రబాబును సీఎంగా గెలిపించుకొని రాష్ట్రాన్ని కాపాడుకుందామని నరసన్నపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. బైదలాపురం, గుమ్మపాడు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, సాధు కృష్ణారావు, పొదిలాపు వేణుగోపాలరావు పాల్గొన్నారు.



పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

టీడీపీలో చేరిన 400 శ్రీశయన కుటుంబాలు



టీడీపీలో చేరిన శ్రీశయన సంఘ నేతలతో గొండు శంకర్

శ్రీకాకుళం క్రైం/అరసవల్లి: నగరంలోని అరసవిల్లి ప్రాంతానికి చెందిన 400 శ్రీశయన కుటుంబాలు వైసీపీని వీడి శనివారం టీడీపీలో చేరారు. రాయిపిల్లి అర్జున్ ఆధ్వర్యంలో చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభు త్వంలో శ్రీశయన కులస్థులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఒక సామాన్యుడి చేతిలో చిత్తుగా ఓడిపోతామన్న భయంతో మంత్రి ధర్మాన మైండ్‌గేమ్ ఆడుతున్నారని, ఈ మాయ మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. పెద్ద ఎత్తున పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. నగర పరిధిలోని 48, 42వ డివిజన్‌లలో శనివారం ప్రజాగళం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ ఇంటింటికీ వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లా డుతూ కుట్రలపై ఉన్న చిత్తశుద్ధి మున్సిపల్ ఎన్నికలపై ధర్మానకు లేదని విమర్శించారు. గొడవలు, అల్లర్లు సృష్టించేందుకు ధర్మాన పన్నాగాలు పన్నుతున్నారని ఆరోపించారు. టీడీపీ ఎన్నికల పరిశీ లకుడు చింతల రామకృష్ణ, నేతలు మాదారపు వెంకటేష్, కృష్ణమూర్తినాయుడు, ఎస్వీ రమణ మాదిగ, సురకాసి వెంకటరావు, విభూది సూరిబాబు, గుమ్మా రఘు రామశర్మ, ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు. ● **గార:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపిం చడం ద్వారా చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని, అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి అన్నారు. శనివారం కళింగపట్నంలో ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా గొండు శంకర్, ఎంపీగా రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కూటమి నాయకులు గుండ భాస్కరరావు కృష్ణమూర్తి, టీఎస్ఎన్ ప్రసాద్, కె.ఆదినారాయణ, జేసీ దేవదాస్, శ్రీధర్, అరంగి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతమొందించండి: అచ్చెన్న



నందిగాం: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న సీఎం జగన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో సాగనంపాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. శనివారం అన్నాపురం, కల్లాడ, దిమ్మిడిజోల, దీనబంధపురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో మేలు: అశోక్

ఇచ్ఛాపురం: సూపర్ సిక్స్‌పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. శనివారం కేదారిపురం, ముచ్చింద్ర, బెనుగానిపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ దాసరి రాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ● **కవిటి:** దశలవారీ మద్య నిషేధం అని ప్రకటించి సీఎం జగన్ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో శనివారం విలేకరులతో మాట్లాడారు.

దుష్టపాలనను తరిమికొట్టాలి: ఎంపీ

పలాసరూరల్: రాష్ట్రంలో దుష్ట పాలన సాగుతోందని, దీనిని రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. లొద్దభద్ర, రెంటికోట, పెదంచల, బ్రాహ్మణతర్లా, చినంచల, గంగువాడ, ఈదురాపల్లి గ్రామాల్లో కూటమి అభ్యర్థులు రామ్మో హన్‌నాయుడు, గౌతు శిరీష ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పీరికట్ల విఠల్‌రావు, వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, జనసేన సమన్వయకర్త దుర్గారావు, వంకల కూర్మారావు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌తో అభివృద్ధి సాధ్యం

● పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి గోవిందరావు

ఎల్.ఎన్.పేట: సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. శనివారం మండలంలోని మోదుగ వలస, పెద్దకొల్లి వలస, చిన్నకొల్లివలస, గొట్టిపల్లి, కొమ్మువలస, రోటరీనగర్, లక్ష్మీనర్సుపేట తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని టీడీపీ నాయకులను కలుసుకుని ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర అభివృద్ధి వెనుకంజలోకి వెళ్లిపోయిందని విమర్శించారు. ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్. నారా యణరావు, జి.రామారావు, గణపతిరావు, ఎ.పోలినాయుడు, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● **కొత్తూరు:** రానున్న ఎన్నికల్లో పాతపట్నం కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు (ఎంజీఆర్)ను గెలిపించాలని టీడీపీ నాయకులు తులసిబాబు, లోతుగడ్డ తులసీవర ప్రసాదరావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో గోవిందరావుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు.



మోదుగవలసలో ప్రచారం చేస్తున్న మామిడి గోవిందరావు

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

● ఆమదాలవలస కూటమి అభ్యర్థి కూన రవికుమార్



పార్టీలో చేరిన వారితో కూన రవికుమార్

పొందూరు: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని, ఈ దిశలో ప్రజలు సహకరించాలని కూటమి ఆమదాలవలస అసెంబ్లీ అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని కేశవదాసుపురం, భగవాన్‌దాస్‌పేట, నర్సాపురం, నందివాడ, వావిలపల్లిపేట, ఇల్లయ్యగారిపేట, ధర్మపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నేతలు అన్నెపు రాము, వండాన మురళీ, వీఆర్ఎల్ నాయుడు, బి.శంకర భాస్కర్, ఖండాపు శ్రీను, బాడాన గిరి, ఎ.చినరంగ, బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీపేటలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

పొందూరు మేజర్ పంచాయతీ పరిధి లక్ష్మీపేటలో 50 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి, వారికి టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన యాదవ, నాగవంశం కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఎ.వాణి, బాడాన హారిక, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, ఎం.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గార: తూలుగు జంక్షన్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గారకి చెందిన మార్పు ఓం దత్తకుమార్ (19) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దత్త కుమార్ ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వైపు వెళుతుండగా తూలుగు మిల్లు సమీపంలో శ్రీకాకుళం నుంచి కొర్ని వెళుతున్న మినీ లగేజ్ వ్యాన్ వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో దత్తకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ ప్రసాద్ తెలిపారు. మృతుడి తండ్రి రమణమూర్తి గార మెయిన్ రోడ్డులో చిన్న ఎలక్ట్రికల్ సామాన్లు బాగుచేస్తుంటారు.

గుంటూరుకు చెందిన డ్రైవర్..

కంచిలి: కంచిలి మండలం పుణ్యస్త్రీ గెడ్డ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరుకు చెందిన డి.రమేష్ అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న లారీ గెడ్డ సమీంపంలో ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొంది. దీంతో లారీ నుజ్జు నుజ్జు కావడంతో పాటు లారీ డ్రైవర్ దనికుల రమేష్ తీవ్ర గాయాలు పాలయ్యాడు. వెంటనే క్షతగాత్రుడిని సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ..

హిరమండలం: భగీరథపురం గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం లో పెద్ద కిట్టాలపాడుకి చెందిన పోగేటి సంతోష్ కుమార్ (28) మృతి చెందాడు. ఎస్ఐ నారాయణస్వామి అందించిన వివరాలిలా ఉన్నాయి.. సంతోష్ ఈనెల 25న తన పెద్దమ్మ పెద్ద కర్మకు బలద గ్రామం వెళ్లాడు, డబ్బులు అవసరం కావడంతో శుక్రవారం రాత్రి రెండు గంటల సమ యంలో ద్విచక్ర వాహనంపై బలదలో బయలు దేరి స్వగ్రామమైన కిట్టాలపాడు వస్తున్నాడు. భగీరథపురం సమీపంలో డొక్కులు కానా మలుపు వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడ్డాడు. వెంటనే సమీపంలోని గొట్ట పోలమ్మ గుడి వద్ద ఉంటున్న వారు 108కి ఫోన్ చేయగా క్షతగాత్రుడిని పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడు పెయింటింగ్ పని చేసుకుంటే జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ స్వామి తెలిపారు.


హైదరాబాద్‌లో నడగాం వాసి..

నరసన్నపేట: నడగాం గ్రామానికి చెందిన తమరాపు లక్ష్మణరావు (40) హైదరాబాద్‌లో విద్యుదాఘాతానికి గురై శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మణరావు గత కొన్నాళ్లుగా మిషన్ భగీరథ నీటి ట్యాంకు పనులు నిమిత్తం ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. అక్కడ పనిలో నిమగ్నమైన సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యు దాఘాతానికి గురై మృతిచెందాడు. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతు న్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు లబోదిబోమంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామంలో దున్న దమయంతి (60) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి సమీపంలోని కాలువలో పడి మృతి చెందిన దమయంతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సీహెచ్ రామారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెంది రెండు రోజులవడంతో కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఇబ్బందులు ఎదుర య్యాయి. కాగా దమయంతి మతిస్థిమితం కోల్పోయినట్లు స్థానికులు చెబుతున్నారు. తన తల్లి దమయంతి రెండు రోజుల నుంచి కనిపించడం లేదని కుమారుడు కృష్ణారావు సోషల్ మీడియాలో మెసేజ్ పెట్టినట్లు చెప్పారు. దమయంతిది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పలాస ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..



పలాస: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు, మార్కెట్ వెనుక శనివారం ఉదయం కాశీబుగ్గ పోలీసులు 45 ఏళ్ల వయ సుండే వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం సాయంత్రం నుంచి మృతి చెందిన వ్యక్తి రైల్వేస్టేషన్ రోడ్డులో మద్యం సేవించి స్థానికులకు తారాసపడ్డాడు. రాత్రి సమయంలో ఆయన కింద పడి మృతి చెందినట్లు గుర్తించారని, అనంతరం సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. సంబంధిత వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

లావేరు: కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరగాణపేటలో జరిగింది. ఎస్ఐ స్వామి నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విశాఖ జిల్లా జీకే వీధి గ్రామానికి చెందిన బొంతల చిట్టిబాబు (35) లావేరు మండలం కరగాణపేట గ్రామంలో కోళ్ల ఫారంలో గడిచిన మూడు నెలలుగా పనిచేస్తూ భార్య, కొడుకు, కూతురు, అల్లుడితో కలిసి నివసిస్తున్నాడు. అయితే గత కొద్ది కాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ పరంగా వివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి భార్యాభర్తలకు వాగ్వాదం జరిగింది. అనంతరం ప్రతీ రోజులానే చిట్టిబాబు తన ఇంటి రెండో అంతస్థులో పడుకునేందుకు వెళ్లాడు. శనివారం ఉదయం ఎంత సేపటికి కిందకు దిగక పోవడంతో భార్య వెళ్లి చూసేసరికి ఫ్యాన్ హుక్కుకి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో భార్య లక్ష్మి లావేరు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ స్వామి నాయుడు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

100 మద్యం సీసాలు స్వాధీనం

కంచిలి: అక్రమంగా రవాణా చేస్తున్న 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సోంపేట ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు. శనివారం ఎస్ఈబీ ఏఎస్పీ గంగాధరం ఆదేశాల మేరకు కత్తివరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దుడ్డి మధుబాబు, బీనా ప్రేమ్‌కుమార్‌ల వద్ద బ్యాగ్‌లో 100 మద్యం సీసాలు గుర్తించి సీజ్ చేశామన్నారు. బీనా ప్రేమ్‌కుమార్ సూపర్‌వైజర్‌గా, మధుబాబు కంచిలి ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నారన్నారు. ● **కొత్తూరు:** నివగాం గ్రామంలో నల్ల హరి చంద్రరావు ఇంటి వద్ద తనిఖీ చేయగా 19 మద్యం బాటిళ్లు, ఒక క్వార్ట్ సీల్డ్ మద్యం బాటిల్, 14 నిప్ లూజ్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రావణ తెలిపారు. అయితే నిందితుడు పారిపోయినట్టు చెప్పారు.

అభివృద్ధిపై ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య తగాదా

● వైసీపీ అభ్యర్థి దువ్వాడ ప్రచారంలో ఘటన



యువకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్న దువ్వాడ

సంతబొమ్మాళి: గ్రామాభివృద్ధిపై ప్రశ్నించినందుకు వైసీపీ కార్యకర్తలు, యువకుల మధ్య శనివారం కూర్మనాథ పురంలో తగాదా చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. టెక్కలి వైసీపీ అభ్య ర్థి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శనివారం సాయంత్రం నౌపడ పంచాయతీ కూర్మనాథపురంలో ఎన్నికల ప్రచారానికి వస్తుండగా గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు నర్సింగరావు, ధర్మారావు అదే గ్రామానికి చెందిన యువకులు సింహాచలం, సాయికుమార్ మధ్య గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై వాగ్వాదం సంభవించింది. ఎన్నికల ప్రచారానికి రావాలని యువకులను వెసీపీ కార్యకర్తలు కోరారు. గ్రామానికి మీరేం అభివృద్ధి చేశారని ప్రచారానికి వస్తున్నారని, మా గ్రామానికి అచ్చెన్నాయుడు రోడ్డు వేశారని సదరు యువకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో వైసీ పీ కార్యకర్త నర్సింగరావుకు ముఖం పై చిన్నపాటి గాయమైంది. దీంతో విషయం తెలుసుకున్న దువ్వాడ శ్రీనివాస్ తన అనుచరులతో అక్కడికి చేరుకుని బాధ్యు లైన యువకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ కిశోర్‌వర్మ అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. దాడి చేసిన యువకులను నౌపడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై నౌపడ ఎస్ఐ కిషోర్ వర్మ మాట్లాడుతూ దాడికి పాల్పడిన యువ కులను అదుపులోకి తీసుకున్నా మని, మెడికల్ రిపోర్టు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తమ్మినేనిపై ఈసీకి ఫిర్యాదు: గాంధీ

ఆమదాలవలస: స్పీకర్, ఆమదాలవలస వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రిగా, రాజ్యాంగబద్ధ పదవి స్పీకర్‌గా విధులు నిర్వహిం చిన సీతారాం పలుమార్లు నామినేషన్ పత్రాల్లో తప్పుడు సమాచారం అఫిడవిట్లు జతపరిచి ఎన్నికల అధికారులను, ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికల నామి నేషన్, ప్రస్తుత ఎన్నికల నామినేషన్ పత్రాల్లో విద్యార్హత విషయంలో స్పష్టత లేని వివరాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం నామినేషన్ పత్రాలతో సరైన ఆస్తుల వివరాలు ఇవ్వలేదన్నారు. అన్ని ఆధారాలతో జిల్లా, రాష్ట్ర ఎన్నికల సంఘానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

పెన్షనర్లంటే చిన్నచూపు తగదు

శ్రీకాకుళం క్రైం: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక రంగ పెన్షనర్లపై సీఎం జగన్‌కు చిన్న చూపు తరగదని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ అన్నారు. స్థానికంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 18వ తేదీ వరకు పెన్షన్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని గెలిపించుకుని చంద్ర బాబును మళ్లీ సీఎంగా చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం మన బాధ్యత పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. పెద్ద న్న గౌడ్, ట్రెజరర్ టి.నాగభూషణం, కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రవాణాపై నిఘా

నరసన్న పేట: నగదు, మద్యం అక్రమ రవాణాపై ఫ్లయింగ్ స్క్వాడ్ దృష్టి సారించింది. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా జమ్ము వద్ద వాహనాలను శనివారం తనిఖీ చేశారు.